క్లుప్తంగా

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఎమ్మెల్యే ముస్తఫా



పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా శనివారం 1, 2 డివిజన్లలో పర్యటించారు. ఇజ్రాయిల్‌పేట, మణిపురం ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మణిపురం రైల్వే ట్రాక్ పక్కన మురుగునీరు నిల్వ ఉంటుందని, ఇబ్బందిగా మారిందని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను రైల్వే డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రంగా రెడ్డి, రెండో డివిజన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హాస్యంతో రోగాలు దూరం



గుంటూరు మెడికల్: హాస్యంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, పలు వ్యాధులు తగ్గుముఖం పడతాయని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు, గుంటూరుకు చెందిన ఎస్వీఆర్ షుగర్ హాస్పటల్ అధినేత డాక్టర్ వి.వి.రామ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ వార్షిక సదస్సు అమెరికాలోని హరిజోనా రాష్ట్రంలోని మీసా నగరంలో ఏప్రిల్ 27 నుంచి 30వ తేదీ వరకు జరిగింది. సదస్సులో డాక్టర్ వి.వి. రామ కుమార్ పాల్గొని హాస్యం ఒత్తిడి 39 శాతం తగ్గుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందనే విషయం పరిశోధనల ద్వారా నిరూపితమైందని ప్రసంగించారు.

పదిలో సత్తాచాటిన మున్సిపల్ విద్యార్థి

నెహ్రూనగర్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని బొర్రా నాగేశ్వరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో చదివిన పి.శ్రీనివాసరావు అత్యధిక మార్కులు సాధించాడు. ఈసందర్భంగా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లాలోని పలువురు అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థి శ్రీనివాసరావును అభినందించారు.

పాఠశాలకు రక్షణ కల్పిస్తాం

పట్నంబజారు: గుంటూరు నగరంలోని సీతారామ్‌నగర్‌లో ఉన్న శ్రీసరస్వతి కమిటీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని గుంటూరు ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ షలేక్ చెప్పారు. గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు శనివారం ఆయన పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో కొంత మంది ఆక్రమణదారులు పడగొడుతున్నారని, 2019 నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు ప్రయత్నించారని తెలిపారు. పాఠశాలను పూర్తిగా సందర్శించి గతంలో ఉన్న కేసుల గురించి తెలుసుకున్న ఆయన పాఠశాలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పోలీసు పాయింట్ బుక్ పాఠశాలలో ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి సమయంలో గస్తీ ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, పాతగుంటూరు ఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బిజినెస్ క్లబ్ పోటీలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో మూడు రోజులపాటు జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లోని ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన బిసినెస్ క్లబ్ పోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, కామర్స్ విభాగాధిపతి ఆచార్య శివరామ్‌ప్రసాద్, టూరిజం విభాగాధిపతి డాక్టర్ పూర్ణచంద్రారావు హాజరై విజేతలకు బహుమతులు అంజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కనక దుర్గ, డాక్టర్ రత్న కిషోర్, డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ నాగరాజు డాక్టర్ విష్ణు , డాక్టర్ సుధీర్, డాక్టర్ భానుచంద్రా రెడ్డి, డాక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంపాక్ట్ మెగా ఈవెంట్‌కు ఉచిత రిజిస్ట్రేషన్

గుంటూరు ఎడ్యుకేషన్ : స్థానిక శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 10,11వ తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంపాక్ట్ మోటివేషన్ ప్రోగ్రామ్‌కు ఉచిత రిజిస్ట్రేషన్ చేపడుతున్నట్లు మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం htt pr://-f-am pa.i n/eve nt కు లాగిన్ అయ్యి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు హాజరయ్యే వారందరికీ ఉచితంగా మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

కాలయాపనకు తగిన మూల్యం బ్లాక్‌లిస్టే!

కాంట్రాక్టర్లకు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ ఏసురత్నం, మేయర్ కావటి

పట్నంబజారు: అభివృద్ధి పనులు నత్తనడకన సాగినా... నాణ్యత లోపించినా... తానే స్వయంగా విజిలెన్స్ విచారణ కోరేందుకు వెనుకాడనని, టెండర్లు వేసి పనులు ప్రారంభించకుండా కాలయాపన చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అల్టిమేటం జారీ చేశారు. కాలక్షేపం కోసం మేము సమావేశాలు జరపడం లేదు.. 150 సంవత్సరాల పై చిలుకు చరిత్ర గల గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి ఒకటే మాట ఒకటే బాటగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. నగరంలోని 18, 20, 22, 23, 32, 34, 35, 36 డివిజన్ల సమీక్షా సమావేశం బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం జరిగింది. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న, జరగబోతున్న పనులపై ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం , నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కార్పొరేటర్లు, అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్నామని, అనంతరం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తామని, దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం, నిర్లిప్తత వీడి... ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయాలని సూచించారు. ప్రభుత్వ పరంగా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలన్న కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. టెండర్లు వేసి రెండేళ్లు గడిచినా నేటికీ పనులు ప్రారంభించలేదంటూ కొందరు కార్పొరేటర్లు తమ దృష్టికి తీసుకుని వచ్చారని, ఇకపై అటువంటివి జరిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. టెండర్లు వేసిన వారు వెంటనే పనులు ప్రారంభించాలని, వారితో సకాలంలో సక్రమంగా పనులు పూర్తిచేయించే బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఏ డివిజన్‌లో కూడా ప్రగతి పనులు పెండింగ్‌లో ఉండడానికి వీల్లేదని, పని చేయగల కెపాసిటీ ఉంటేనే టెండర్లు వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. దాదాపు కార్పొరేటర్లంతా ఆరోపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని, చేయలేని వారు, చేతగాని వారు దయచేసి టెండర్లు వేయొద్దన్నారు. టెండర్లు వేసిన వారు తక్షణమే పనులు ప్రారంభించి, క్షేత్రస్థాయిలో తాము పర్యటించే నాటికి పూర్తి చేయాలని తేల్చి చెప్పారు. ప్రగతి పనుల విషయంలో ప్రజలెవరూ తమను ప్రశ్నించని విధంగా పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నట్లు చెప్పారు. గుంటూరులో మరింత వేగంగా ప్రగతి పనులు జరుగుతున్నాయని, అభివృద్ధి జరుగుతుంటే దండలు వేసే ప్రజలు, అలసత్వం వహిస్తే బండలు వేస్తారన్న వాస్తవాన్ని గుర్తెరిగి ప్రజాక్షేమానికి అనుగుణంగా కాంట్రాక్టర్లు పనులు వేగిరం చేయాలన్నారు. డివిజన్ల వారీగా జరుగుతున్న ఈ సమీక్షా సమావేశాల సారాన్ని మినిట్స్ రూపంలో కమిషనర్‌కు తెలియజేసి మెరుగైన ఫలితాలు రాబట్టాలని సంబంధిత అధికారులను కోరారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరంలో మున్నెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నది అక్షర సత్యమన్నారు. సుమారు రూ.200 కోట్ల రూపాయల మేర ప్రగతి పనులు జరుగుతున్నాయని, ఒక్కొక్క డివిజన్‌లో 4 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు వివిధ దశలలో ఉన్నట్లు తెలిపారు. తమ సహకారాన్ని అందిపుచ్చుకుని లాభాపేక్షతో కాకుండా ప్రజాహితం కోసం పనులు చేపట్టాల్సిన ఆవశ్యకతను కాంట్రాక్టర్లు గుర్తించాలని కోరారు. ప్రగతి పనుల అమలు విషయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), నిమ్మల వెంకటరమణ, బూసి రాజలత, సాధు రాజేష్, గేదెల రమేష్, పార్టీ నగర నేత బందా రవీంద్రనాద్, డివిజన్ ఇన్‌చార్జులు కంతేటి శ్యామ్, ఖాజా, టీఎల్‌వీ వీరాంజనేయులు, హరిప్రసాద్, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈలు రమేష్, రఫీక్, ఏఈ రాంబాబు, ఏపీసీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జైన్ గుడి ప్రతిష్ఠా మహోత్సవం



పాత గుంటూరు: విద్యానగర్ 3వ లైనులో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న జైన్ గుడి ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో జైపూర్ నుంచి 1800 కిలోమీటర్లు పాదయాత్ర ద్వారా గుంటూరు విద్యానగర్‌కు చేరుకున్న జైన్ గురు శ్రీ మణిప్రభ్ సురీజి, గురువులు, శిష్యులు, 30 మంది జైన్ సాధ్వీలకు జైన్‌లు ఘనస్వాగతం పలికారు. అనంతరం సిద్ధార్థ కన్వెన్షన్ హాల్‌లో ధర్మ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 10న ఉదయం 8 గంటలకు విద్యానగర్ గుడి ప్రదేశం నుంచి సిద్ధార్థ కన్వెన్షన్ వరకు ఊరేగింపు, 11న ఉదయం జరిగే గుడి ప్రతిష్ఠా మహోత్సవాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను గురువులు వివరించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్‌రావు, కిలారి రోశయ్య, డెప్యూటీ మేయర్ షేక్. సజీల, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మేరాంచంద్‌జీ ఉండియా పరివార్, జుగ్రాజ్ బంధారీ, గుడి ప్రతిష్ఠా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

సృజనాత్మకతతో విశ్వజనీయ అవకాశాలు

- వీసీ ఆచార్య పి.రాజశేఖర్
- ఘనంగా ఏఎన్‌యూ ఆర్కిటెక్చర్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, వేదికపై యూనివర్సిటీ అధికారులు

ఏఎన్‌యూ: విద్యాపరమైన డిగ్రీతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకుంటే విశ్వజనీయమైన అవకాశాలు పొందవచ్చని వీసీ ఆచార్య పి రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో శనివారం జరిగిన యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ ప్రసంగిస్తూ విద్యార్థులు విశ్వవిద్యాలయంలో నేర్చుకున్న విలువలతో కూడిన విద్యా నైపుణ్యాలను సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని సూచించారు. ప్రపంచ దేశాల సంస్కృతి సాంప్రదాయాలపై నిశిత పరిశీలన చేయడం వంటి వాటి ద్వారా మెరుగైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎంపిక చేసుకున్న రంగంలో స్థిరపడి విలువలతో కూడిన సేవలు అందించాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పుట్టిన ఊరుని మరిచిపోవద్దన్నారు. విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులకు బోధనాపరమైన అంశాలతోపాటు నైపుణ్యంపై ఆసక్తి ఉండాలన్నారు. భవిష్యత్ లో ఉత్తమ వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. రెక్టార్ ఆచార్య పి.వర ప్రసాద మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం ఇంతటితో నే ముగియకూడదని మరెన్నో ఉన్నత చదువులు, పరిశోధనలు చేయాలని సూచించారు. నూతన జాతీయ విద్యావిధానంలో అనేక నైపుణ్య సంబంధిత కోర్సులు అందుబాటులో ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ రూపొందించుకోవాలన్నారు. అనంతరం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ప్రిన్సిపాల్ ఈ. శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు.

వసతి గృహాల్లోనూ అధ్యయనానికి పూర్తి వసతులు

- ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు పూర్తి వసతులు
- వీసీ ఆచార్య రాజశేఖర్
- బాలుర వసతి గృహాలలో రీడింగ్ రూమ్స్ ప్రారంభం



రీడింగ్ రూంలో వసతులు పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్

ఏఎన్‌యూ: వసతి గృహాల్లో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు అన్ని వసతులు కల్పిస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాలలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్స్ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. రీడింగ్స్ రూమ్స్‌ను విద్యార్థుల చేతులమీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ కళాశాలల్లోని లైబ్రరీలతోపాటు వసతి గృహాలలో కూడా విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం, వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకుని విద్య, భాష, భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ గతంలో మెస్‌హాల్స్‌ను ఆధునిక వసతులతో రీడింగ్ రూమ్స్‌గా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. పోటీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యే అన్ని వసతులు ఉన్నాయన్నారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ రీడింగ్ రూమ్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వసతులు కల్పించనున్నామన్నారు. బాలుర వసతి గృహాలలోని నాలుగు వసతి గృహాలలో ప్రత్యేకంగా రీడింగ్ రూమ్స్ అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు వార్డెన్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలను అందించేందుకే....

- జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూ నగర్: నాణ్యమైన ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమ లక్ష్యం అని నగర అదనపు కమిషనర్ పెద్దిరోజా పేర్కొన్నారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో మే 9 నుంచి ప్రారంభం కానున్న స్పందన – జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వివిధ విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు, స్పందన అధికారులు, ఆపరేటర్లకు, సచివాలయ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ పెద్దిరోజా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చే స్పందన కార్యక్రమం కన్నా మెరుగైన పరిష్కారం , అధికారుల్లో జవాబుదారీతనం కోసం మే నెల 9 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 1902 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని, హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి గ్రీవెన్స్ రిజిస్టర్ చేస్తే దాన్ని అత్యంత నాణ్యతతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. పరిష్కారంపై అన్నిస్థాయిల్లో మానిటరింగ్ విభాగాలు కూడా ఉంటాయన్నారు. గ్రీవెన్స్ పరిష్కారంలో క్వాలిటీని పెంచడం అన్నది ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. హెల్ప్ లైన్‌కు గ్రీవెన్స్ వస్తాయని వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఐవీఆర్‌ఎస్, ఎస్‌ఎంఎస్‌ల ద్వారా తాము చెప్పిన సమస్యల పరిష్కారంపై ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ అందుతాయని, సమస్యల పరిష్కారంపై అర్జీదారుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటుందన్నారు. వార్డు సచివాలయాల్లో వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సి.హెచ్. శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, డి.సి.పి లు మూర్తి, కొటయ్య , ఈ.ఈ లు సుందర రామిరెడ్డి, కొండా రెడ్డి, సిఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, డి.ఈ లు, ఎ.సి.పి లు, టి.పి.ఎస్ లు , ఎ.ఈ లు, నగరపాలక సంస్థ మేనేజర్ శివన్నారాయణ, ఈ–డిస్ట్రిక్ అధికారి రత్నం, రెవెన్యూ అధికారులు, స్పందన అధికారులు, విభాగ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ముస్తఫా భేటి



పట్నంబజారు: నియోజకవర్గంలోని డివిజన్‌ల పరిధిలో సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియంలోని ఆయన కార్యాలయంలో శనివారం కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. నియోజకవర్గ డివిజన్ కార్పొరేటర్లు, పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్నా కార్పొరేటర్లకు పూర్తి సహాయ సహకారాలు అందించి పరిష్కారానికి పాటు పడతామన్నారు. గుంటూరు నగర అభివృద్ధి లక్ష్యంగా దృష్టి సారించామన్నారు. అభివృద్ధిపనులు ఒక్కొక్కటిగా చేపడుతూ ముందుకు సాగుతామన్నారు. అదేవిధంగా నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగరపాలక సంస్థ కౌన్సిల్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార నిర్వాహకులపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీకాలనీలో ఓ నివాసంలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడిచేశారు. నిర్వాహకుడు, ఇద్దరు విటులు, ఇరువురు మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మహిళలను రెస్క్యూ హోమ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి మహిళ మృతి

గుంటూరు ఈస్ట్: మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ భవనంపై నుండి కింద పడి మృతిచెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం 4వలైనులోని ఓ అపార్టుమెంట్ నివాసం ఉంటున్న రవికుమార్తె తేజశ్వి (25) మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. శనివారం భవనంపై అంతస్తు నుండి కిందపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

వ్యాపారులకు ఏఎస్పీ సూచన



మాట్లాడుతున్న ఏఎస్పీ నచికేస్ షలేక్

పట్నంబజారు: నగరంలో షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని ఈస్ట్ ఏఎస్పీ నచికేస్ షలేక్ చెప్పారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం పూల మార్కెట్ సెంటర్ పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ఏమైనా నేరాలు జరిగిన సమయంలో పూర్తి స్థాయిలో నేరస్తులను పట్టుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అందుకని వ్యాపార సముదాయాల యజమానులు వారి షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సహకరించాలన్నారు. సమావేశంలో లాలాపేట పీఎస్ సీఐ ఎం.సుబ్బారావు, ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఐపీఎల్ స్క్రీన్ మ్యాచ్‌లకు మంచి స్పందన



స్క్రీన్‌పై మ్యాచ్‌ను వీక్షిస్తున్న అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రేక్షకుల వీక్షణం కోసం బీసీసీఐ శనివారం స్థానిక బ్రాడీపేటలోని ఎల్‌ఈఎం స్కూల్లో ఏర్పాటు చేసిన మెగా డిజిటల్ స్క్రీన్‌కు మంచి స్పందన వచ్చింది. సుమారు 4 వేల మంది యువకులు మ్యాచ్‌లను చూసేందుకు వచ్చారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి డ్రా తీసి వచ్చిన వారికి బహుమతులు అందజేసారు. అయితే చెన్నై సూపర్ కింగ్స్– ముంబై ఇండియన్స్ మ్యాచ్ మధ్యలో వర్షం కురవడంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి, బీసీసీఐ ఆపరేషన్స్ కోర్డినేటర్ సుమిత్, జీడీసీఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్‌వీ రమణ మూర్తి, దాసరి రమేష్ కుమార్, అన్నంరాజు సాయిరం పాల్గొన్నారు.

హనుమాన్ జీ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

హాజరైన లేళ్ళ, కావటి, మద్దాళి, చంద్రగిరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి

పట్నంబజారు: నమ్మకానికి ప్రతిరూపం.. సాహసానికి నిలువెత్తు రూపం.. నిస్వార్థమైన భక్తి భావం.. శ్రీరామునికి దక్కిన గౌరవమే.. ఆయన భక్తునికి దక్కిన శ్రీరామ దూత హనుమంతుని నుంచి ప్రతి ఒక్కరూ నిస్వార్థమైన కర్తవ్య దీక్షను అలవరచుకోవాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. హనుమజ్జయంతి సందర్భంగా హైందవ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన జరుగనున్న శ్రీ హనుమాన్ జీ శోభాయాత్ర పోస్టర్‌ను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మేయర్ కావటి మనోహర్ నాయుడుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మే 14న జరుగనున్న శ్రీ హనుమాన్ జీ శోభాయాత్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఓటములు ఎన్ని ఎదురైనా మనోధైర్యం, బుద్ధి కుశలత ఉంటే విజయాలు వాటంతటవే ఉప్పెనలా వరిస్తాయని అంజనీపుత్రుడిని చూసి నేర్చుకోవాలన్నారు. శ్రీరామ దూతాం శిరసా నమామి అంటూ నిత్యం ఆంజనేయుడిని పూజించాలనీ... అంతకంటే ఎక్కువగా ఆయన వ్యక్తిత్వంలోంచి ఎంతో కొంతైనా నేర్చుకోవాలనీ... హిందూ భక్త మహాశయులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), హిందూ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు వనమా నరేంద్ర, సాధు రామకృష్ణ, అనిల్ బెహరా, రామరాజు త్రికోటేశ్వరరావు, సాయి చరణ్ గుప్తా, ఈశ్వర్ గౌడ్, శశాంక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో స్పాండిలైటిస్ తగ్గించవచ్చు



డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ

గుంటూరు మెడికల్: యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ అనేది దీర్ఘకాలిక సమస్య అని గుంటూరు రుమటాలజీ అండ్ ఇమ్యూనాలజీ సెంటర్ అధినేత డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ చెప్పారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ డే సందర్భంగా శనివారం కొత్తపేటలోని హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో రుమాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పొద్దున్న నిద్ర లేవగానే, ఎక్కువ సేపు కూర్చున్న తరువాత, లాంగ్ డ్రైవ్ తరువాత, వంగి లేస్తున్నప్పుడూ, బరువులు ఎత్తినప్పుడూ బాక్ పెయిన్ వస్తుంటే జాగ్రత్తపడాలన్నారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ ఒక రకమైన ఆర్థరైటిస్ అని. ఇది వ్యక్తి యొక్క వెన్నుముకను ప్రభావితం చేస్తుందన్నారు. స్పైన్‌లో ఉన్న జాయింట్స్ ఇన్‌ఫ్లేమ్ అవ్వడం వల్ల ఇది వస్తుందని పేర్కొన్నారు.ఈ సమస్య టీనేజ్ లో, ఇరవై నుండి 40 ఏళ్ళ మధ్యలో ఏర్పడుతుందని, మహిళలకంటే మూడు రెట్లు ఎక్కువగా పురుషులు ఈ సమస్య బారిన పడుతున్నట్లు వెల్లడించారు. యాంక్లోజింగ్ స్పాండిలైటిస్ ఎందువల్ల వస్తుందో ఖచ్చితమైన కారణాలు తెలియవని, వారసత్వంగా కూడా రావచ్చు అన్నారు. రక్తపరీక్షలు, ఎమ్మారై స్కాన్ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. సమస్యని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య పెద్దది కాకుండా కట్టడి చేయవచ్చు అన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయ డం ద్వారా సమస్యను అదుపులో పెట్టవచ్చన్నారు.

ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల అభివృద్ధికి కృషి

ఏపీ సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి



విజయలక్ష్మిని సత్కరించిన ప్రిన్సిపల్ హరిబాబు

పాత గుంటూరు: అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ మేరిగ విజయలక్ష్మి అన్నారు. శనివారం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలను విజయలక్ష్మి సందర్శించారు. ప్రిన్సిపల్ హరిబాబు పాఠశాలలో పలు సమస్యలను ఆమెకు తెలిపారు. గత ఆరు దశాబ్దాల నుంచి అకాడమీకి సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను హరిబాబు వివరించారు.